ప్రజాశక్తి

గురువారం 28 డిసెంబరు 2023

5

శ్రీకాకుళం

ప్రశాంతంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

ఎచ్చెర్ల : ఎపిపిఎస్‌సి నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆధారిత డిపార్ట్‌మెంటల్ పరీక్షలు తొలిరోజు బుధవారం ప్రశాంతంగా సాగాయి. శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం నిరహించిన పరీక్షలకు 97 హాజరు కావాల్సి ఉండగా, 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 87 హాజరు కావాల్సి ఉండగా, 19 మంది గైర్హాజర్యారు. వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు వంద మంది హాజరు కావాల్సి ఉండగా 19 గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 40 మంది హాజరు కావాల్సి ఉండగా, తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. శివానీ కాలేజ్‌లో ఈనెల 29న మాత్రమే పరీక్షలు జరుగుతాయని, వెంకటేశ్వర కాలేజ్‌లో డిసెంబరు 31, జనవరి ఒకటో తేదీ మినహా మూడో తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు.

అంగన్వాడీల ఆగ్రహం

- 16వ రోజుకు చేరిన సమ్మె
- ప్రజాప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాల ముట్టడి
- వినతిపత్రాలు అందజేత

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఉధృతమవుతోంది. బుధవారానికి సమ్మె 16వ రోజుకు చేరుకోగా, సమ్మెలో భాగంగా ప్రజాప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాలను అంగన్వాడీలు ముట్టడించారు. తమ సమస్యలు పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలతో హోరెత్తించారు.

పలాస : మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

శ్రీకాకుళం నగరంలోని పెద్దపాడులో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు క్యాంపు కార్యాలయం వద్ద పెద్దసంఖ్యలో అంగన్వాడీలు బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు మంత్రి గానీ, సిబ్బంది గానీ స్పందించలేదు. చివరకు మంత్రి పిఎస్ వచ్చి మంత్రి లేరని, ఈనెల 31న వస్తారని చెప్పారు. ఆందోళన విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లి తమకు నిర్దిష్ట హామీ ఇవ్వాలని సిఐటియు నాయకులు, అంగన్వాడీలు డిమాండ్ చేశారు. దీనిపై స్పందన లేకపోవడంతో కార్యాలయాన్ని ముట్టడించడానికి సిద్ధమయ్యారు. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులను ప్రతిఘటిస్తూ అంగన్వాడీలు ముందుకెళుతుండడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు అరెస్టులకు సిద్ధమవుతున్న తరుణంలో మంత్రి తనయుడు రామ్‌మనోహర్ నాయుడు బయటకు వచ్చి వినతిపత్రాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి జె.కాంచన, టి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు నుంచి అంగన్వాడీ కార్యకర్తలు భారీ ర్యాలీగా వెళ్లి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఇంటిని ముట్టడించారు. అంగన్వాడీలను పోలీసులు అడ్డుకోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మంత్రి వచ్చే వరకు వెళ్లేది లేదని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. అనంతరం అంగన్వాడీల వద్దకు వచ్చిన మంత్రి అప్పలరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, బి.ఆనందరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలస పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుంచి పూజారిపేటలోని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం నివాసం వరకు ర్యాలీగా వెళ్లిన అంగన్వాడీలు అక్కడ రెండు గంటల పాటు బైఠాయించారు. స్పీకర్ తనయుడు చిరంజీవి నాగ్ వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, పి.భూలక్ష్మి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కవిటి మండలం బల్లిపుట్టుగలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ నివాసానికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గేటు వద్ద అంగన్వాడీలు ఆందోళన చేశారు. తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి వారి వద్దకు వెళ్లగా విజయకు వినతిపత్రం అందించారు. రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే అశోక్ నివాసానికి చేరుకుని తమ సమస్యలు ఏకరువుపెట్టారు. అండగా నిలవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ క్యాంపు కార్యాలయాన్ని అంగన్వాడీలు ముట్టడించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ, వాణిశ్రీ, సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రణస్థలంలో అయ్యప్పస్వామి ఆలయ కూడలి నుంచి ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఇంటి వరకు ర్యాలీగా వెళ్లారు. ఎమ్మెల్యే లేకపోవడంతో పిఎకు వినతిపత్రం ఇచ్చి వెళ్లాలని సిఐ ఆదాం చెప్పారు. ఎమ్మెల్యే వచ్చే వరకు వెళ్లేది లేదని మూడు గంటల పాటు అక్కడే ఆందోళన చేపట్టారు. చివరకు ఎమ్మెల్యే రావడంతో ఆయనకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.సుజా, బి.అప్పమ్మ, ఎం.రాధిక తదితరులు పాల్గొన్నారు. పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి నివాసం వద్ద ఆందోళన అనంతరం ఆమెకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.శాంతామణి, రాణి, సిఐటియు నాయకులు సూరయ్య తదితరులు పాల్గొన్నారు. నరసన్నపేటలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు శిరీష, డి.సరోజిని, పి.భాగ్యలక్ష్మి, సిఐటియు నాయకులు ఆర్.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ, సిఐటియు నాయకులు హెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మంత్రి ధర్మాన క్యాంపు కార్యాలయం వద్ద అంగన్వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

కవిటి : జెడ్‌పి చైర్‌పర్సన్ విజయకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

కవిటి : ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

రణస్థలం : ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

టెక్కలి : ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

ఆమదాలవలస : స్పీకర్ తమ్మినేని సీతారాం ఇంటి ముందు బైఠాయించిన అంగన్వాడీలు

ఎంపీ ల్యాడ్స్ వినియోగంలో జిల్లా ప్రథమ స్థానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంలో రాష్ట్రంలోనే జిల్లా తొలి స్థానంలో నిలిచిందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి 17వ లోక్‌సభ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం కింద నిధుల వినియోగం, పూర్తయిన పనులు, యుసిల సమర్పణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. మిగతా మంజూరైన పనులన్నీ వేగవంతం చేయాలని, వాటిని ఒక నెలలోగా పూర్తి చేయాలన్నారు. యుటిలైజేషన్ సర్టిఫికేట్‌ను సబ్‌మిట్ చేయాలని సూచించారు.

ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ 17వ లోక్‌సభకు సంబంధించి మొత్తం రూ.23.24 కోట్లతో 455 పనులు మంజూరు చేశామన్నారు. ఇందులో 298 పనులు పూర్తయ్యాయని, కొత్తగా మరో 20 పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. మిగతా పనులు పలు దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు రూ.16 కోట్లను బిల్లుల రూపంలో చెల్లించినట్లు వివరించారు. నిధుల వినియోగంలో శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై అధికారులకు అభినందనలు తెలిపారు. పెండింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించి, రానున్న రెండు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసన్నలక్ష్మి, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ సుబ్రమణ్యం, పలువురు ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు, కలెక్టర్

మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

22న తుది ఓటర్ల జాబితా

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం పూర్తిస్థాయి ఓటర్ల తుది జాబితాను జనవరి 22వ తేదీన విడుదల చేయనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కొత్తగా ఓటరు నమోదు కోసం అక్టోబరు 28 నుంచి ఈనెల తొమ్మిదో తేదీ మధ్య జిల్లాలో 49,649 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించని కారణంగా వాటిలో 2,492 దరఖాస్తులు తిరస్కరించినట్లు చెప్పారు. పలు కారణాలు చూపుతూ 51,270 ఓట్లు తొలగింపు కోసం దరఖాస్తులు వస్తే వాటిని పరిశీలించి 47,327 ఓట్లను తొలగించామని తెలిపారు. వాటిలో మృతుల పేరుతో 14,982 ఓట్లు ఉన్నాయని, రెండు ఓట్లు కలిగిన 10,040 మంది ఓట్లు వాటితో కలిపి తొలగించినట్లు చెప్పారు.

ప్రస్తుతం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఇతర సవరణల కోసం వచ్చిన క్లయిమ్‌ల పరిశీలన తుది దశకు చేరిందని, ఎన్నికల సంఘం సూచనల మేరకు వచ్చే నెల 12వ తేదీ నాటికి వాటిని పరిష్కరిస్తామన్నారు. ఇంకా అర్హత ఉన్న వారు ఓటు హక్కు పొందేందుకు ఫారం-6ను నేరుగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ అందజేసుకునేందుకు వీలుందన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, కాంగ్రెస్ నాయకులు గోవింద మల్లిబాబు, ఎ.కేశవరావు, బిఎస్‌పి నాయకులు జి.రామారావు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

నమ్మకద్రోహానికి జగన్ నిదర్శనం

ప్రజాశక్తి - కవిటి

నమ్మకద్రోహానికి నిలువెత్తు నిదర్శనం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలే కాకుండా ప్రజలను మభ్యపెట్టి ఆడిన ప్రతి మాట అబద్ధమని ఈ ఐదేళ్లలో నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. మండలంలోని రామయ్యపుట్టుగలో తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్ రద్దు చేస్తానని హామీనిచ్చి మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. రైతులకు ఏడాదికి రూ.13,500 రైతుభరోసా అందిస్తానని చెప్పి కేవలం రూ.7,500తో చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మద్యపాన నిషేధం చేస్తానని, విద్యుత్ బిల్లులు తగ్గిస్తానని, రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తానని ఇచ్చిన హామీల మాటేమిటని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఏటా జాబ్ కేలండరు ప్రకటిస్తానని చెప్పి, జాబు లేకుండా చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు గుణపాఠం చెప్పేందుకు రాష్ట్రం యావత్తు ఎదురుచూస్తోందన్నారు.

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

తాలూకా కేంద్రాల్లో యుటిఎఫ్ ధర్నాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక సంబంధమైన బకాయిలను విడుదల చేయాలని యుటిఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ తాలూకా కేంద్రాల్లో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు బుధవారం ఆరు గంటల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీన జీతం, మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీనిచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకొచ్చాక ఉద్యోగులు, ఉపాధ్యాయులపై భిన్నమైన వైఖరిని అవలంభిస్తూ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు ఇవ్వకపోగా.. కనీసం ఒకటో తేదీన జీతం కూడా చెల్లించడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పిఆర్‌సి ఎరియర్లు రూ.6,246 కోట్లు, పిఆర్‌సి ముందు డిఎలు రూ.1136 కోట్లు, పిఆర్‌సి తర్వాత డిఎలు రూ.4,848 కోట్లు, పిఎఫ్ లోన్లు పార్ట్ ఫైనల్ పేమెంట్లు రూ.వెయ్యి కోట్లు, ఎపిజిఎల్ఐ ఫైనల్ పేమెంట్లు రూ.330 కోట్లు, ఇతర అరియర్లు రూ.4,500 కోట్లు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉందని వివరించారు. ఇవికాక సిపిఎస్ ఉద్యోగుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన వాటా రూ.2,500 కోట్లు బకాయి ఉందన్నారు. శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం తహశీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజి, పి.చిన్నారావు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం తహశీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు డి.ప్రకాశరావు, బి.శ్రీను, శోభన్‌బాబు, కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద చేపట్టిన ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, డి.గణపతిరావు, టి.వైకుంఠరావు, బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ సంఘీభావం తెలిపారు. సోంపేటలో చేపట్టిన ధర్నాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.వి.టి భాస్కరరావు, జి.శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. పొందూరులో ధర్నా అనంతరం తహశీల్దార్ వై.వి ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.గౌరీశ్వరరావు, నాయకులు జి.గోపాలరావు, బి.మహేష్, బి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు. రణస్థలం ధర్నా అనంతరం తహశీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రవికుమార్, ఎస్.స్వర్ణకుమారి, డి.కోటేశ్వరరావు, డి.రామారావు తదితరులు పాల్గొన్నారు. పలాస తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, సిద్ధు, ఎల్.వెంకటాచలం, బి.చిట్టిబాబు, జి.కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్

1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతను జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, వైద్యారోగ్య, ఇతర శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆరోగ్య సురక్షలో స్పెషలిస్ట్ డాక్టర్ల భాగస్వామ్యంతో సచివాలయాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. శిబిరం పేరు, వైద్యుల పేర్లతో జియోట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ రిఫరల్ సేవలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పండగ వాతావరణంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో 364 సచివాలయాల పరిధిలో అన్నిచోట్లా క్రీడలు ప్రారంభం కావాలని తెలిపారు. 1,243 మ్యాచ్‌లను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రేక్షకుల హాజరును నమోదు చేయాలని, మ్యాచ్ ఆరంభానికి ముందు, ఫలితం తర్వాత తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయాలని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ క్రీడలు నిర్వహిస్తున్న మైదానాల్లో క్రీడాకారులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, వాటి ఫొటోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఎస్‌డిఒ కె.శ్రీధర్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సాంస్కృతిక శోభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈ ఏడాది పలు కళా ప్రదర్శనలతో సాంస్కృతిక శోభ వెల్లివిరిసింది. నగరంలోని కళావేదికలపై నృత్య ప్రదర్శనలు, నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలను కళాకారులు ప్రదర్శించి ప్రేక్షకాదరణ పొందారు. అరసవల్లిలో వారం రోజుల పాటు నిర్వహించిన సురభి నాటకోత్సవాలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయం వ్యవస్థాపకులు స్వాతి సోమనాథ్, నీరజా సుబ్రమణ్యం, రఘుపాత్రుని శ్రీకాంత్, శివ, మంది దివ్య ఇతర కళాకారులు తమ శిష్య బృందాలతో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. సుమిత్ర కళాసమితి ఆధ్వర్యాన నాటక పోటీలు ఆకట్టుకున్నాయి.

దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో శివ, రఘుపాత్రుని శ్రీకాంత్, నీరజా సుబ్రమణ్యం బృందాలు నృత్య ప్రదర్శనలు ఇచ్చాయి. శ్రీసుమిత్ర కళా సమితి ఆధ్వర్యాన ఫిబ్రవరిలో అష్టావధానం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం, గాయత్రి కళాశాల సంయుక్తంగా యువజనోత్సవాలను నిర్వహించాయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యాన అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో జిల్లాలోని కళాకారులే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు ఆలయ ప్రాంగణంలో నృత్య ప్రదర్శనలు, కోలాటం, సుద్దులు ప్రదర్శించారు. అనకాపల్లి, విజయనగరం కోలాటం బృందాల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంగీత, సాహిత్య కళల క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీకచ్ఛపి కళాక్షేత్రం దశమ వార్షికోత్సవ వేడుకలను నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఘనంగా నిర్వహించారు. రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో రాష్ట్రస్థాయి గాత్ర కచేరీ విద్వాంసులు ప్రదర్శనలు ఇచ్చారు.

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏడాది పొడవునా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కోలాటం, కథాకళి, కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ, భోజ్‌పురి సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. నవంబరులో సురభి నాటకోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహించారు. కృష్ణార్జున యుద్ధం, సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణ పాండవీయం వంటి పౌరాణిక నాటకాలు అలరించాయి. సుమిత్ర కళాసమితి ఆధ్వర్యాన ఈ కేంద్రంలో పలు నాటికలను ప్రదర్శించారు.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM
O.S No.380/2023

Between:
Boddu Ramana ...Plaintiff
And:
Boddu Suryarao and 5 others ...Defendants

To
Defendant No.5:-
Botta Venkata laxmi, W/o Appayya, S/o late Sanyasappadu, Hindu, aged about 35 years, House wife, R/o Seetha valasa (v), J.R. Puram Panchyat, Ranasthalam (M), Srikakulam (Dist

NOTICE

Please take this notice that the above matter is posted to **22-01-2024** for your appearance. You are hereby directed to appear before the Hon'ble court **at 10-30 A.M** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

// By court order //
P.V.RAMANA DAYAL
Advocate,
ILLISIPURAM, SRIKAKULAM,
CELL: 9849171366.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE (PROH & EXCISE) AT SRIKAKULAM
O.S 468/2019

Between:
Kelli Mallayya ..Petitioner/ Plaintiff
And:
The General Manager BSNL Telecon District and 2 others ...Respondents/Defendants

To
Defendant No.3:-
The Chairman & Managing Director, BSNL, New Delhi.

NOTICE

Please take this notice that the above matter is posted to **02-01-2024** for your appearance. You are hereby rected to appear before the Hon'ble court **at 10-30 A.M** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

// By court order //

P.V.RAMANA DAYAL
Advocate,
ILLISIPURAM, SRIKAKULAM,
CELL: 9849171366.

బహిరంగ ప్రకటన

తేదీ 22-08-2023న నేను పి.ఎన్ కాలనీలో గల నా ఇంటి వద్ద నుంచి బయలుదేరి వ్యక్తిగత పనులు పూర్తిచేసుకుని శ్రీకాకుళం పట్టణంలో గల పాత బస్టాండ్‌లో నా యొక్క ద్విచక్ర వాహనాన్ని ఏపీ39 4136 మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పార్కింగ్ చేసుకుని సామాన్లు కొనుగోలు చేయడానికి మార్కెట్‌కి వెళ్లాను. సామాన్లు కొనుగోలు చేసి వచ్చి చూడగా నా యొక్క వాహనానికి తగిలించిన కవర్ కనిపించలేదు. అందులో వేరొక బ్యాగ్ ఉన్నది. బ్యాగులో 21 ఖాళీ చెక్కులు మరియు 16 ప్రామిసరీ నోట్లు ఉన్నాయి చెక్స్ నెంబర్లు 453384, 219206, 219212, 219213, 219214, 219215, 020877, 020878, 020883, 754677, 754683, 459749, 459750, 927809, 927810, 927811, 927812, 927813, 927814, 927816, 927821 దయచేసి ఈ పైన తెలుపబడిన చెక్కులు మరియు ప్రామిసరీ నోట్లు ఎవరికైనా దొరికినట్లయితే ఈ క్రింది ఫోన్ నెంబర్ కు తెలియజేయ వలెను

ఇట్లు
సువ్వారి వెంకటరమణ
ఫోన్ నెంబర్: 8978735827,
శ్రీకాకుళం.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు

అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టెక్కలి డిపో నుంచి నందిగాం మండలం దిమ్మిడిజోల పరిసర కొండల ప్రాంతాలకు, వల్లభరాయుడుపాడు పరిసర గ్రామాలకు పల్లెవెలుగు బస్సులను నడపాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. టెక్కలి డిపో నుండి పెద్దతామరాపల్లి, కర్లపూడి, నౌగాం, ఖల్లాడ మొదలగు కొండల ప్రాంతాలను కలుపుతూ దిమ్మిడిజోల గ్రామం వరకు ఉదయం, సాయంత్రం పల్లెవెలుగు బస్సులను నడపాలని, గతంలో ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం వివిధ కారణాలతో ఈ బస్సును తొలగించారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ గ్రామాలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించి ప్రజలకు రవాణా సమస్యలు తొలగించాలని ఆయన కోరారు. అలాగే టెక్కలి డిపో నుండి నందిగాం మండలం మణిగాం, వల్లభరాయుడుపాడు గ్రామాల వరకు బస్సులను నడపాలని ఆయన డిపో మేనేజర్‌కు లేఖ ద్వారా కోరారు.

పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సాగు భూములకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలం జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస గ్రామానికి చెందిన పేద కుటుంబాలు సాగుచేసుకున్న భూములకు లబ్ధిదారులకు పట్టాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేతులు మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ భూములను సాగుచేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, జె.ఆర్.పురం పంచాయతీ సర్పంచ్ బవిరి రమణ, కొండ ములగాం పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి గొర్లె అప్పలనాయుడు, వైసిపి నాయకులు పిన్నింటి సత్యంనాయుడు, రాయపురెడ్డి శ్రీను, కోల అప్పన్న, కోల అప్పడోర, ముద్దాడ రాజశేఖర్, తిప్పాన సతీష్, చౌదరి రాము, దంప చిన్నారెడ్డి, లంకలపల్లి శంకర్, డిటి సత్యవతి, విఆర్‌ఒ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆస్పత్రిపై ఫిర్యాదులు వస్తే చర్యలు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పనితీరు బాగులేదని, ఇకపై వైద్యుల నిర్లక్ష్యం వ్యవహరించిన, ఆస్పత్రిపై ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త భాస్కరరావు వైద్యాధికారులకు హెచ్చరించారు. ఆస్పత్రి నిర్వహణ బాగులేదని, ఆస్పత్రి తనిఖీ చేపట్టిన మంత్రి సీదిరి అప్పలరాజు డిసిహెచ్ఎ భాస్కరరావు, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో బుధవారం సాయంత్రం డిసిహెచ్ఎ పలాస ఆస్పత్రిని సందర్శించి వైద్యాధికారులతో రహస్యంగా సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి వస్తున్న రోగులకు ఎందుకు వైద్యసేవలు అందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి పనితీరుపై పత్రికల్లో కథనాలు వచ్చినా, ఆరోపణలు వచ్చినా ప్రతిఒక్కరిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయనతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాల్లో కొత్త చట్టాలు తీసుకువస్తూ న్యాయవాదుల హక్కులను కాలరాస్తున్నదని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి భాయ్ అన్నారు. బుధవారం కోర్టు బయట ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా న్యాయవాదులు విధులను బహిష్కరించి రిలేనిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాక్ట్ 2023 వలన రాష్ట్రంలోని 90వేల మంది న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటువంటి చర్యలకు ప్రభుత్వం ఒడి కట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ముఖ్యంగా సివిల్ తగాదాల విషయంలో న్యాయవాదులు కోర్టుల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తుంటే ఈ చట్టం ద్వారా కేవలం ఒక అధికారి తుది తీర్పు ఇవ్వడం అనేది చట్టబద్ధత కాదని మండిపడ్డారు. ఈ యాక్ట్ వలన ప్రజలు పలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు చాపర రమేష్, బొడ్డేపల్లి మోహనరావు, పైడి వరహానరసింహం, తమ్మినేని అన్నంనాయుడు, గురుగుబెల్లి ప్రభాకరరావు, బూర్లె సీతారాం పాల్గొన్నారు.


ఆన్‌లైన్ వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

'ఐతమ్'లో వర్క్‌షాప్

టెక్కలి రూరల్: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ 'టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్‌లో విద్యాజల విభాగం ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బేసిక్ సైన్సెస్ హ్యూమానిటీస్ సౌజన్యంతో 'ఇంజనీరింగ్ కెమిస్ట్రీలో ఎ.1 అనువర్తనాలు' అనే అంశంపై మంగళవారం ఆన్‌లైన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఎస్.భాస్కరబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్, నోడల్ ఆఫీసర్ విద్యాంజలి, డాక్టర్ ఎం.రమణయ్య, అసోసియేట్ ప్రొ, కోర్డనేటర్‌గా వ్యవహరించారు. డాక్టర్ కె.కిరణ్ కుమార్ ప్రసంగీకులుగా వ్యవహరించారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎ-1ను కెమిస్ట్రీల్తో అన్వయించి ఫార్మ, వ్యవసాయం, నానో టెక్నాలజీ- ఇంజనీరింగ్ కెమిస్ట్రీ, స్పెక్ట్ర ఫోటోమీటర్‌లో ఏవిధంగా మెరుగైన, త్వరితగతిన ఫలితాలు సాధించవచ్చో వివరించారు. కెమిస్ట్రీని బాగా అధ్యయనం చేయడం ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

మెళియాపుట్టి: విద్యుత్తు లైన్లు మరమ్మత్తులు చేయనుండడంతో గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెళియాపుట్టి సబ్‌స్టేషన్ పరిధిలో మెళియాపుట్టి, చాపర, పట్టుపురం, పెద్దలక్ష్మీపురం, జోడూరు, జాడుపల్లి, పెద్ద పద్మాపురం తదితర గ్రామాలకు మరమ్మతులు చేస్తుండడంతో విద్యుత్‌సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శన

శ్రీకాకుళం : నిరసన ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరింది. నగరంలో కార్మికుల సమ్మె ఫలితంగా ఎక్కడ చెత్త అక్కడే పేరుకు పోయింది. నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలను కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. కార్మికులు సమ్మెలో భాగంగా నగరంలోని ఏడురోడ్ల కూడలి నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె విచ్ఛిన్నం చేయడానికి కొత్త కార్మికులతో పని చేయించాలని చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలన్నారు. పాదయాత్రలో, అసెంబ్లీ సాక్షిగా జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థలో కార్మికులంతా సమ్మె చేస్తుండగా అధికారులు గత అర్ధరాత్రి పోటీ కార్మికులను తెచ్చి పట్టణంలో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు, సమ్మెను విచ్ఛనం చేసేందుకు ప్రయత్నం చేయగా కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించడంతో పోటీ కార్మికులు వెనక్కి వెళ్లిపోయారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ ఏడు ప్రకారం క్లాప్ ఆటోలో డ్రైవర్లకు నెలకు రూ.18500 వేతనం ఇవ్వాలని, నీటి సరఫరా, వీధిలైట్లు, యుజిడి కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. నాయకులు కళ్యాణ రాజు, రాము, ఎ.రాజేష్, టి.వెంకటలక్ష్మి, టి.మల్లమ్మ, జె.మాధవి, మోహన్, డి.యుగంధర్, ఎం.నారాయణరావు, సురేష్ కుమార్, అప్పన్న పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె విజవంతంగా రెండవ రోజుకి చేరింది. బుదవారం మస్టర్ కార్యాలయం నుంచి భారీర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతనం అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నట్టు సిఐటియు కన్వీనర్ రమేష్ కుమార్ పట్నాయక్ అన్నారు. తమ డిమాండ్లు పరిష్కారం చేసేంతవరకు ఆందోళన కొనసాగుతుందన్నారు.

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని పారిశుద్ధ్య కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేపడుతున్నారు. బుధవారం ఉదయం మోనింగివారి వీధిలో మున్సిపాలిటీ వాహనాల షెడ్డు నుంచి చెత్త ఎత్తే కొన్ని ట్రాక్టర్లను బయటకు తీయడానికి మున్సిపల్ కమిషనర్ ఎం. రవి సుధాకర్ ప్రయత్నించగా విషయం తెలుసుకున్న పారిశుధ్య కార్మికులు మాకుమ్మడిగా అక్కడకు చేరుకొని ట్రాక్టర్లను తీయడానికి ప్రయత్నించిన డ్రైవర్లను అడ్డుకున్నారు. మీరు డ్రైవర్లు అయినప్పటికీ పారిశుద్ధ్య కార్మికుల గానే నమోదై ఉన్నారని మీరు కూడా సమ్మెలో భాగమని మీరు ఇలా విధుల్లోకి రావడం ఎంత వరకు సమంజసమని మున్సిపల్ యూనియన్ నాయకుడు తాడి సంతోష్ ప్రశ్నించారు. వారు వెంటనే సమ్మెలో మేము ఉన్నామని విధులకు హాజరు కాలేమని కమీషనర్‌కు చెప్పి ట్రాక్టర్లను అక్కడే విడిచిపెట్టి బయటకు వచ్చేశారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ ట్రాక్టర్లను అడ్డుకుంటున్న సంఘటనను ఫోన్ ద్వారా ఎస్ఐ వై.కృష్ణకు తెలిపారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువు వర్గాలకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మిక నాయకులు టి.సంతోష్, జె.శ్రీనివాస్, కె.తారకేశ్వరరావు, జె.వాసు, ఎన్. రాజేష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : గేటు ముందు బైఠాయించిన పారిశుధ్య కార్మికులు

ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తు్న కార్మికులు

పలాస: సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద రెండోరోజు నిరవధిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మురగన్, ఎం.రవి, యూనియన్ నాయకులు దివాకర్, ఎస్. శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబి, సావిత్రి, లక్ష్మీ పాల్గొన్నారు.

రోజా హుందాగా ఉండాలి

ప్రజాశక్తి- పలాస

మాట్లాడుతున్న శిరీష

రోజా అంటే నీచమైన భాషకు బ్రాండ్ అంబాసిడర్ అని, రాజకీయాల్లో మహిళలు ఎంతో హుందాగా, ఆదర్శంగా ఉండాలని రోజా మాత్రం మహిళ అన్న సంగతి మరచి మాట్లాడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష విమర్శించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి నాయకుల కోసం మీరు మాట్లాడే మాటలు, హావభావాలు చూస్తుంటే సాటి మహిళగా సిగ్గు పడుతున్నామన్నారు. జగన్‌రెడ్డి ప్రాపకం కోసం, మీకు సీటు కోసం అసభ్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. టిడిపి 175 స్థానాల్లో పోటీపై రోజా నోరు పారేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి అంటే క్రమశిక్షణ కలిగిన పార్టీ, టిడిపి పార్టీలోనే కార్యకర్త నుంచి నాయకుల వరకు హుందాగా ఉండేటట్టు చంద్రబాబు తీర్చిదిద్దారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా 175 నియోజకవర్గాల్లో గెలుపు సాధించే అభ్యర్థులతో టిడిపి సిద్ధంగా ఉందని, వైసిపి ఎమ్మెల్యేలే బయటకు వెళ్లిపోతున్నారని ఈ విషయం రోజా తెలుసుకోవాలన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో ఎమ్మెల్యే అభ్యర్థులను మారుస్తున్నారని ఇది జగన్ రెడ్డి పరిస్థితి అన్నారు. ప్రజా వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉండడంతో రోజా పిచ్చి పట్టినట్లుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు.

వైసిపి నుంచి టిడిపిలోకి....

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం దుప్పిలపాడు పంచాయతీ వైసిపికి చెందిన ఉప సర్పంచ్ గురువెళ్లి అప్పన్న, వార్డు మెంబర్ ఎండ దాలినాయుడు, వాలంటీర్ పేడాడ అప్పన్నలతో పాటు పలు కుటుంబాలతో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడుల సమక్షంలో టిడిపిలో చేశారు. వీరికి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయిన రమేష్, సాసుమంత ఆనందరావు ఉన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలం పెంట గ్రామంలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను బుధవారం ఎంపిపి మీసాల సత్యవతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా రూ.25 లక్షల వరకు వైద్య చికిత్స పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, పున్నాన్న సోనియా, ఎంపిటిసి మక్కా శ్రీలత, పున్నాన అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, సిహెచ్ఒ శివప్రసాద్ పాల్గొన్నారు.

కాకినాడలో ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభల్లో చర్చల్లో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడకుండా నిర్లక్ష్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేసి సమ్మెకు ప్రభుత్వమే ప్రేరేపించడం తగదని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే పార్కు వద్ద సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన ధర్నా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగులందరూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 26వేల మంది సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితి ప్రభుత్వమే కల్పించిందని విమర్శించారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కనీస అవసరాలైన ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయకుండా ఏళ్ల తరబడి పని చేయించుకుంటున్నారన్నారు. ప్రధానంగా ఉద్యోగులు అడుగుతున్న న్యాయసమ్మతమైన సమస్యలను పరిష్కరించడంలో పట్టనట్టు వ్యవహరించడం తగదన్నారు. ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మధన్‌మోహన్ మాట్లాడుతూ వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులతో పాటు ప్రతినెల 1న వేతనాలు చెల్లించాలన్నారు. అంతకు ముందు నగరంలో పొట్టి శ్రీరాములు కూడలివద్ద మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావుతో పాటు సంఘ ప్రతినిధులు నాయక్, కృష్ణ, కిశోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తవిటినాయుడు, కోశాధికారి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బగాది గిరిధర్, ఎం.పోతయ్య, యుగంధర్ పాల్గొన్నారు.

మట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

పనితీరు బాగాలేదు

వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

మెరుగైన వైద్యంకోసం వస్తున్న రోగులకు ఎందుకు వైద్యసేవలు అందించడంలేదని, పనితీరు మార్చుకోకపోతే సహించేదిలేదని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులవార్డులు, వైద్యుల గదులు పరిశీలించగా 12 మంది రోగులకు 17 మంది సిబ్బంది ఉండడం చూసి అవాక్కయ్యారు. వైద్యుల గదుల్లో వైద్యులు లేకపోవడంతో ఆస్పత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఆనెపు సుశీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది సెలవుపెట్టగా మరికొంత మంది విధుల్లో ఉన్నట్లు సంతకాలు చేసి ఆస్పత్రి బయటకు వెళ్లిపోవడంపై మంత్రి సీదిరి తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రజాఆరోగ్యంపై బాధ్యత లేకుండా వైద్యులు ఉండటం సరికాదన్నారు. నాడు-నేడు ద్వారా కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆస్పత్రిలో ఆధునీకరణ చేయడం జరిగిందని, పేదప్రజలకు కనీస వైద్యం అందించకపోతే రోగులు ఎలా వస్తారని ప్రశ్నించారు. 12 మంది రోగులకు 17 మంది సిబ్బంది అంటే సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. నిండు గర్భిణీలకు వేరే ఆస్పత్రికి రిఫర్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గర్భిణిని 108 వాహనంలో టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో ఆమె 108 వాహనంలో ప్రసవించిన విషయం ఉన్నతస్థాయి అధికారులకు మంత్రి పోన్‌లో తెలిపారు. పలాస ఆస్పత్రి పనితీరుపై ఇటీవల రోజు వార్తల్లో వస్తున్నా సిబ్బంది, వైద్యులతీరు మారకపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. విధి నిర్వాహణలో అంకిత భావంతో పనిచేయాలని, ఇక్కడ పని చేయడం ఇష్టం లేకపోతే బదిలీ చేసుకుని వెళ్లిపోవచ్చని తీవ్ర స్వరంతో చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కెటి రోడ్డు పూర్తి చేశామని చెప్పే దమ్ముందా...?

పలాస: నియోజకవర్గంలో అభివృద్ధి చేతకాక ప్రజల దృష్టి మార్చడానికి మంత్రి సవాల్ అని తెరపైకి తీసుకువచ్చారని, కెటి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశామని చెప్పే దమ్ముందా అంటూ టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక ఆస్పత్రిలో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ రూపకల్పన చేసిన డయాలసిస్ కేంద్రంలో పరికరాలు, 200 పడకల రీసెర్చ్ సెంటర్‌కు తరలించడం మీ అభివృద్ధికి అద్దం పడుతుందన్నారు. రూ.700 కోట్లతో అసంపూర్ణ నిర్మాణాలు చేపట్టి ఒక్క గ్రామానికైనా చుక్కనీరు అందించారా అని ప్రశ్నించారు. మీ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి లోకేష్‌పై సవాల్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్‌ను విమర్శించడానికి మీ జగన్మోహన్‌రెడ్డికే అర్హత లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, అంబటి కృష్ణమూర్తి, శశి భూషణ్ పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

నందిగాం: మండలంలో దేవలభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను టెక్కలి ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ బుధవారం సందర్శించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని, నాడు-నేడు పనులను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద అమల తీరుపై విద్యార్థులతో మాట్లాడి విషయాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. 10వ తరగతి విద్యార్థులకు మార్చిలో జరగనున్న పరీక్షలకు సన్నద్ధం కావాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు వేసుకోవాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం హెచ్ఎం పూర్ణిమ, ఉపాధ్యాయులకు అభినందించారు.

యువత భవిష్యత్‌ను నిర్మించుకోవాలి

రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

యువతలో నైపుణ్యాలను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రభుత్వం రూపొందించిందని, ఈ పోటీల ద్వారా యువత మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. పైడిభీమవరం-1 గ్రామ సచివాలయం పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి ఉజ్వల భవిష్యత్తు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి మహిళా విభాగం జనరల్ సెక్రటరీ గురాన తిరుమల మానస, పైడిభీమవరం పంచాయతీ ఎంపిటిసిలు ఆకల శ్రీనువాసరావు, మునకాల దుర్గారావు, నాయకులు లంకలపల్లి రమేష్, నారాయణ అప్పారావు, అల్లంపల్లి నాగరాజు, గురాన చిరంజీవి, సెక్రటరీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం నందిగాం సచివాలయం పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్రికెట్ పోటీలను రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో ఈదుపురం పంచాయతీలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు వరప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్, వివేకానంద రెడ్డి, కె.మోహనరావు, కృష్ణారావు, త్రినాథ్ పాల్గొన్నారు.

కొత్తూరు : వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొత్తూరు: మండలంలో ఒండ్రుజోల గ్రామంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే క్రికెట్ ఆడి యువకులను ఉత్సాహపర్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, సర్పంచ్ ప్రతినిధి గ్రంథం నాగేంద్ర, సర్పంచ్ పి.సాధుబాబు, వైకుంటారావు, వైసిపి నాయకులు జి.ఆనందరావు, పంకజ్ దాస్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి సచివాలయం పరిధిలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న మండల శాఖ నాయకులు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- సోంపేట

మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం నిర్వహించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో సంఘ సమావేశం నిర్వహించారు. మండల శాఖ నూతన అధ్యక్షుడిగా డి గోవిందరావు, గౌరవాధ్యక్షుడుగా బి చక్రధర్, ప్రధాన కార్యదర్శిగా జి తిరుపతిరావు, ఉపాధ్యక్షులుగా ఢిల్లీరావు, రవీంద్ర భారతి, రవికుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శులుగా కె.సంధ్య, బి.మురళి, విజయ్, హరీష్‌లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీరందరితో సంఘ నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో చాణిక్య, రాజేష్ తత్తెను పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న విఆర్ఎ సంఘ నాయకులు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామ రెవిన్యూ సహాయకులుగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న విఆర్ఎల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం అధ్యక్షులు అప్పలస్వామి, ప్రధాన కార్యదర్శి సురేష్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ గణపతిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం 1307, 1308 జిఒలు అనుసరించి డిఎ మంజూరు చేయాలని, అర్హులైన విఆర్ఎలను అటెండర్లుగా, విఆర్ఒలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, రికవరీ చేసిన డిఎ మొత్తాన్ని విఆర్ఎలకు చెల్లించాలని కోరారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఫార్మా కంపెనీ ప్రతినిధులు

ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో ఎన్.జి.ఆర్ పురం, విజయనగరం జిల్లా చింతపల్లి పంచాయతీలో ఉన్న ఇద్దరు మత్స్యకారులు కుటుంబ పోషణ కోసం చేపల వేటకు వలస వెళ్లి ఇతర ప్రాంతాల్లో మరణించారు. మృతి చెందిన ఇద్దరు మత్స్యకారుల కుటుంబాలకు అరోబిందో ఫార్మా ఫౌండేషన్ ఒక్కోక కుటుంబానికి రూ.1.50 లక్షలు చొప్పున రూ. 3 లక్షలు పైడిభీమవరం పరిశ్రమ ఆవరణలో బుధవారం చెక్కులను అందజేశారు. మత్స్యకార కుటుంబ సభ్యులు అరోబిందో ఫార్మా యాజమాన్యం ప్రతినిధులు నిత్యానంద రెడ్డి, శరత్ చంద్ర రెడ్డికి అభినందనలు తెలిపారు.

'పది' మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారుచేసిన పదవ తరగతి మోడల్ పేపర్లను యుటిఎఫ్ అభిమాని రాళ్లపేట పాఠశాల ఉపాధ్యాయిని మారం రాజేశ్వరి సౌజన్యంతో బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య మాట్లాడుతూ సామాజిక స్పృహతో యుటిఎఫ్ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజాస్పందన లభించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శోభారాణి, యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు డి. గణపతి, కార్యవర్గ సభ్యులు మారం కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల సముదాయాలు

టెక్కలి: విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పాఠశాలల సముదాయాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు వేరువేరుగా ఈ సముదాయాలు నిర్వహించనున్నారు. గురువారం తెలుగు, గణితం, సైన్సు సబ్జెక్టులకు సముదాయాలు నిర్వహించగా, శుక్రవారం హిందీ, ఇంగ్లీష్, సాంఘిక శాస్త్రాలకు సముదాయాలు నిర్వహించనున్నారు. రెండు మండలాలకు ఒకేసారి ఈ సముదాయాలు టెక్కలిలో జరగనున్నాయి.

బడ్జెట్‌ను చదివి వినిపిస్తున్న ఎంపిపి సత్యవతి

అంచనా బడ్జెట్ ఆమోదం

జి.సిగడాం: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిషత్ బడ్జెట్ సమావేశం బుధవారం ఎంపిడిఒ కె.నిశ్చల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి మీసాల సత్యవతి హాజరయ్యారు. 2023-24 సంవత్సరం సవరణ బడ్జెట్ అన్ని పద్దుల ఆదాయం రూ.49, 05,56,000కాగా వ్యయం 49,05, 47,000గా చూపించారు. మిగులు బడ్జెట్ రూ.90 వేలుగా ఉన్నట్టు ఎంపిడిఒ తెలిపారు. అలాగే 2024-2025 అంచనా బడ్జెట్ కూడా రూపొందించారు. అంచనా బడ్జెట్‌లో అన్ని పద్దతులు ఆదాయం రూ.53,88,68,000 కాగా, వ్యయం 53,88, 53,000 కోట్లుగా రూపొందించడం జరిగిందని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్ ఎంపిపి తోలేటి వెంకటరావు, ఇఒపిఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు, ఎఇ రామకృష్ణ, కార్యాలయ ఎఒ వి.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ జగన్నాథం, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమస్యలపై సమీక్ష

కొత్తూరు: మండలంలో మాతల క్యాంపు కార్యాలయం బుధవారం పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి పొన్నుటూరు, గురండి, నీలకంఠపురం, మెట్టూరు బిట్-1, 2, 3 పంచాయతీలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాల్లో సమస్యలు, భవిష్యత్ గ్యారంటీ నమోదు తదితర అంశాలపై గ్రామస్తులతో సమీక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పి. మోహనరావు, నెల్లి అచ్చుతరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా మేట్లకు శిక్షణ

టెక్కలి: మండలంలోని ఉపాధి హామీలో పనిచేస్తున్న మహిళా మేట్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఎపిఒ సుశీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఉమాలక్ష్మి, ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేతన దారులకు 100 రోజుల పని కల్పించటంతో పాటుగా గ్రామాలలో సుస్థిర ఆస్తులను నెలకొల్పటానికి ఉపాధి హామీ పనులు దోహదపడుతు న్నాయన్నారు. మేట్లు వేతనదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మస్తర్లు వేయాలన్నారు. వేతనదారుకి ఇచ్చిన కొలతలను పూర్తిచేసి గరిష్ట వేతనం పొందడానికి ప్రభుత్వం ఏర్పరచిన వ్యవస్థే మేట్లని, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి మస్టర్లు, పని ప్రదేశాలలో వసతుల కల్పన చేయాలని సూచించారు. మహిళా మేట్లు టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గత సమస్యలను పరిష్కరించాలి

టెక్కలి: గత సమావేశంలో వచ్చిన సమస్యలను ముందుగా పరిష్కరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి ఉమాలక్ష్మీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పలు శాఖలపై రివ్యూ నిర్వహించారు. విద్య, వైద్యం, హౌసింగ్, తాగునీరు, ఎలక్ట్రికల్, అగ్రికల్చరల్ శాఖల మీద అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలే ఉన్న తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి లుర్ధు, ఎఎంసి చైర్మన్ బి. శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, రమాదేవి, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వేపాడ: మండలంలో పనిచేస్తున్న వాలంటీర్లందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వాలంటీర్లు డిమాండ్‌చ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపిడిఒ పట్నాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించ కపోతే ఈ నెల 28 తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని అప్పటికీ పరిష్కారం కాకపోతే 29వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు సిహెచ్ రామకృష్ణ, కె. స్వర్ణకుమారి, పి. సౌందర్య, పి.శ్రామిక, కె.కన్నారావు, కె.లత, డి.శాంతికుమారి, టి. శ్రీదేవులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

వంగర: మండలంలోని కొండ చాకరాపల్లిలో బెవర రమేష్ నాయుడు, బెవర భాస్కరరావు ఆధ్వర్యంలో పలువురు వైసిపిని వీడి టిడిపిలో బుధవారం చేరారు. వీరందరికీ రాజాం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన రమేష్ నాయుడు, భాస్కరరావు మాట్లాడుతూ వైసిపిలో వివక్షకు గురై ఎన్నో ఇబ్బందులు పడ్డామని అందువల్ల టిడిపిలో చేరుతున్నామని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు బొచ్చ వాసుదేవరావునాయుడు, లచ్చుబుక్త కృష్ణ మూర్తి, పిన్నింటి మోహనరావు, నియోజకవర్గం ఎస్‌సిసెల్ అధ్యక్షులు మజ్జి గణపతి, నాలుగు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పైడిరాజుకు అభినందన

నెల్లిమర్ల: 43వ రాష్ట్ర స్థాయి మాష్టర్స్ అథ్లెట్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నాలుగు మెడల్స్ సాధించిన పి.పైడిరాజుని నెల్లిమర్ల షటిల్ బ్యాడ్మింటెన్ అసోసియేషన్ అభినందించింది. ప్రకాశం జిల్లా రామయ్యపట్నం హైస్కూల్ గ్రౌండులో ఈ నెల 24,25 తేదీలలో ఈ పోటీలు జరిగాయి. విజయనగరం జిల్లా తరుపున పాల్గొన్న పైడిరాజు 5000 మీటర్ల వాకింగ్‌లో గోల్డ్ మెడల్, 200 మీటర్లు రన్నింగ్‌లో సిల్వర్, 400 మీటర్లు రన్నింగ్‌లో సిల్వర్, రిలే రన్నింగ్‌లో సిల్వర్ మెడల్‌ని సాధించారు. పైడిరాజు విద్యుత్ శాఖలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేయడమే కాకుండా నెల్లిమర్ల షెటిల్ బ్యాడ్మింటెన్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కూడా ఉన్నారు. పైడిరాజు నాలుగు మెడల్స్ సాధించడం తమకెంతో గర్వకారణమని అసోసియేషన్ అభిప్రాయపడి అభినందించింది. బ్యాడ్మింటెన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఎం.కె. లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు బయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను దోచుకుంటున్న రైస్‌మిల్లర్లు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ధాన్యం కొనుగోలులో రైస్‌మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతులు తెచ్చిన ధాన్యానికి ఎటువంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని పదేపదే చెబుతున్నప్పటికీ ఏదోఒక సాకుచెప్పి బస్తాకు మూడు నుంచి ఐదు కిలోల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని వారు ఆరోపించారు. ముఖ్యంగా కోటబొమ్మాళికి చెందిన మురళీకృష్ణ మోడరన్ రైస్‌మిల్లు యాజమాన్యం ధాన్యం అంతా బాగున్నప్పటికీ, సచివాలయ సిబ్బంది ధాన్యం బాగున్నాయని చెబుతున్నా బస్తాకు మూడు కేజీలు అదనంగా తీసుకుంటున్నారని, ఏంటీ ఈ దారుణం అంటే అసభ్యకరంగా మాట్లాడుతున్నారని రైతులు యర్నాగుల నాగేశ్వరరావు, సూర్యనారాయణలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పనిచేసి పండించిన పంటను వీరి దగ్గరకు తెచ్చి వారికి నచ్చినట్లు ఇవ్వాల్సి వస్తుందని వారు అందోళన వ్యక్తంచేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

సరికొత్త హంగులతో ఎస్‌ఆర్ షోరూం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి తదితరులు

ఎస్‌ఆర్ షాపింగ్ మాల్ 14వ షోరూమ్ శ్రీకాకుళంలో పట్టణంలో 2వ బ్రాంచిగా గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు షాపింగ్‌మాల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్. ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్పీకర్ తమ్మినేని సీతారాం, పశుసంవర్ధకశాఖ, మత్స్యకార మరియు డైరీ డెవలప్మెంట్ శాఖామంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, సిఎంఆర్ టెక్స్‌టైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకటరమణ, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద రావు, ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చయ్యనాయుడు హాజరవుతారని తెలిపారు. ప్రముఖ సినీతార పాయల్ రాజ్పుత్, నేహా శెట్టి జ్యోతి ప్రజ్వలన చేపడతారని తెలిపారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ డైరెక్టర్ మాట్లాడుతూ గత 17 సంవత్సరాల సుదీర్ఘమైన అనుభవంతో దేశంలోనే పేరుపొందిన తయారీదారుల నుంచి నాణ్యమైన వస్త్రాలను కస్టమర్స్‌కు అందించడం జరుగుతుందన్నారు. ఈయనతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వి.పూజారి, ఎ.శివకేశరెడ్డి, ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, బ్రాంచి మేనేజర్ రమేష్ ఉన్నారు.

సామాజిక చైతన్యం అవసరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సర్పంచ్ రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

గ్రామీణ ప్రాంతంలో మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యుల్లో సామాజిక చైతన్యం పెంపొందించే ఉద్దేశంతో జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం మండలంలో కత్యాచార్యులపేట గ్రామంలో సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత, బాల్యవివాహాలు వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాలికా విద్యా, ఉపాధి అవకాశాలను మెరుగుకు, సమాజంలో చైతన్యం కలిగించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విఒఎ రాజులమ్మతో పాటు గ్రామసంఘం ప్రతినిధులు, స్వయంశక్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దుకాణాల సమూహం ప్రారంభం

ప్రజాశక్తి- పర్లాకిమిడి

దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న కార్యనిర్వహణాధికారి

గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలో ఫారెస్ట్ గేట్ వద్ద దుకాణాల సమూహాలను కాశీనగర్ ఎన్‌ఎసి కార్యనిర్వహణాధికారి భాగవత్ సాహు ప్రారంభించారు. ఆహార కేంద్రం వెనుక వైపు నిర్మాణమైన వంట గదిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాశీనగర్ ఎన్‌ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి, ఉపాధ్యక్షులు రఘురామ్ సాహు, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు. ఈ దుకాణాల సమూహం చాలా ఏళ్లుగా వివాదస్పదంగా ఉంది. ఎన్నికలకు ముందు ఈ దుకాణాల సమూహం నిర్మాణం కోసం అప్పటి ఎన్‌ఎసి కార్యనిర్వహణాధికారి సంపూర్ణ రైతో చాలా ప్రయత్నం చేశారు. ఆ నిర్మాణాలు రోడ్డు మీదనే నిర్మిస్తున్నారని హై కోర్టులో కేసు వేయడంతో తాత్కాలికంగా ఆగిపోయింది. అయితే హైకోర్టు నిర్ణయాధికారం కార్యనిర్వహణ అధికారికే ఇవ్వడంతో ప్రస్తుత ప్రభుత్వం దుకాణాల సమూహం మళ్ళీ ప్రారంభించింది.

ట్యాబ్‌ల పంపిణీ

డెంకాడ: ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం కోరారు. డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ఆయన చేతులు మీదుగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈ ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయని వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యలో ముందుకు సాగాలని కోరారు. ముందుగా పాఠశాలలో ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సచివాలయ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతివాడ గౌరీ, కార్యదర్శి వాసు, రామకృష్ణ మాస్టర్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో సమానత్వం ఉండాలనే ఉద్దేశంతో, పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. నిండు మనసుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు

బైక్ ర్యాలీ విజయవంతం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి నుంచి నందిగాం వరకు జరిగిన బైక్‌ర్యాలీను విజయవంతం చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులకు దన్యవాధాలు తెలుపుతున్నానని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపుమేరకు నియోజకవర్గంలో గల నాలుగు మండలాలకు చెందిన టిడిపి శ్రేణులు, జనసేన సైనికులు పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేశారన్నారు. పార్టీకోసం కష్టపడి టిడిపిని అధికారంలోకి తీసుకువద్దామన్నారు.

జెడ్‌పి మాజీ చైర్మన్‌కు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అనారోగ్యం బారిన పడి మృతి చెందిన మాజీ జెడ్‌పి చైర్మన్ ఎచ్చెర్ల వెంకట సూర్య నారాయణ పార్థీవదేహం వద్ద బుదవారం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పుష్పగుచ్ఛం ఉంచి నివాళ్లర్పించారు. అరసవల్లిలో ఆయన స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. సర్పంచ్‌గా, జెడ్‌పిటిసి సభ్యునిగా, చైర్మన్‌గా ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న లీలారాణి తదితరులు

జైభీమ్ సేన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సోంపేట

పట్టణ జైభీమ్‌సేన కార్యాలయంలో బుధవారం సంస్థ వార్షికోత్సవ కరపత్రాన్ని సంస్థ ఆర్థిక కార్యదర్శి నగిరి లీలారాణి ఆవిష్కరించారు. అనంతరం సంస్థ జిల్లా అధ్యక్షుడు నగిరి మోహనరావు మాట్లాడుతూ ఈ నెల 31న శ్రీకాకుళంలో జరిగే వార్షికోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పి.దుర్యోధన, డి.వెంకటరావు, ఎం.సూర్యనారాయణ, ఆనంద్, శ్రీను, అచ్చుత్ పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- కొత్తూరు

సింగపూర్ రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఇండియన్ సొసైటీ ఎపి రాష్ట్రశాఖ శ్రీకాకుళం జిల్లా శాఖ సారధ్యంలో మండల పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో ఆరోగ్యం, కరోనా, పోషకాహారం, చేతులు పరిశుభ్రత, దోమల బారి నుండి రక్షించుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ ఉపశాఖ ఆధ్వర్యంలో చీపురుపల్లి, కొత్తగూడ, ఉల్లిమణుగూడ గ్రామాల ప్రజలకు దోమతెరలు, దుప్పటి, హైజిన్ కిట్, పూరిళ్లలో ఉన్నవారికి తార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ గిరిజనుల ఆరోగ్య పరిస్థితిని మెరుగు పర్చడానికి కలెక్టర్ సూచనతో అవగాహన కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పొగిరి రవి, బి. చిన్మయరావు, పి.సుజాత, కె.సత్యనారాయణ, జి.పవన్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు వస్తువులు బహూకరణ

వేపాడ: మండలంలోని బల్లంకి ప్రాథమిక పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఉపాధ్యాయుడు తాడాన అప్పారావు, విజయ కుమారి దంపతులు తమ తల్లిదండ్రుల చేతుల మీదుగా ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ పదివేల రూపాయలు విలువ చేసే పెన్నులు, స్కేలు, జామెంట్రీ బాక్స్‌ను బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఇమంది, జగదీశ్వర్ రావు, ఎన్.శ్రీరాములు, ఎస్.అప్పారావు, పిసి కమిటీ చైర్మన్ రావు పాల్గొన్నారు.